

# రక్షణ

రావిచెట్టు దగ్గరగోల, గాలిలో తేలొచ్చి డాబామూలని పట్టుకుంటోంది.
సారథి చూస్తుండగానే అక్కడున్న ఒకళ్ళిద్దరు పిల్లలకి మరో నలుగురు చేరారు.

ఒకడు కిందనుంచి యింత మట్టితీసి విసిరాడు....మరోడు చేతిలోని రావికొమ్మతో అదిలిస్తున్నాడు....యింకో కుర్రాడు వెక్కిరిస్తూ అరుస్తున్నాడు. అటు యిటూ పరుగెడుతోంది ఆ మనిషి ....ఏదో అంటోంది.

ఆ మనిషి తిన్నగా కనపట్టంలేదు సారథికి. రేగిన జుట్టూ.... నీలం వోణీ, మాసి బరువుగా వేళ్ళాడుతున్న లంగా....తలలో ఏవో రెండుమూడు రంగుల రిబ్బన్లు....అంతే, డాబామీంచి అవే కనిపిస్తున్నాయి.

"ఏమిటో ఆ సరదా వాళ్ళకి" అనుకున్నాడు సారథి. ఇంక అటు చూళ్ళేక చుట్టూ చూశాడు.

వీథికి... ఒకరకంగా ఊరికీ చివరగా ఉందా రావిచెట్టు. అందుకనే ఆటలకి వీలుగా వుంటుందని రోజు సాయంత్రం పిల్లలు.·. పిచ్చాపాటికి కొంతమంది పెద్దాళ్ళు అక్కడ చేరుతారు. రావిచెట్టుకి

కొంచెం దూరంలో కూచుని కబుర్లు చెప్పుకుంటున్న పెద్దాళ్ళు చూస్తున్నారు జరుగుతున్న దంతా. వాళ్ళైనా ఆ పిల్లల్ని కేకలేస్తే బాగుణ్ణు అనుకున్నాడు సారథి.

కుర్రాళ్ళు అలా ఆటగా పిచ్చిదాన్ని బాధపెడుతున్న దానికన్నా. పెద్దాళ్ళు ఆ చోద్యం చూస్తూ కూచోటం బాధగావుంది సారథికి.

"ఓ మనిషి బాధని చూట్టంలో ఏమిటో ఆనందం...." సారథి ఆలోచన పూర్తికాలేదు. ఎవరో బుర్ర మీసాలాయన అక్కడ జరుగు తున్నది చూస్తూ నవ్వుకుంటూ డాబాముందునుంచి వెడుతున్నాడు. పైనుంచిచూస్తే ఆయన మీసాలు తూనీగల్లా కనిపించాయి సారథికి.

తూనీగలు.... ఒక్కసారిగా సారథి ఆలోచన ఉలిక్కిపడింది. చిన్నప్పుడు తన తోటి కుర్రాళ్ళతో కలిసి తూనీగల్ని పట్టుకోవటం గుర్తొచ్చింది సారథికి....చప్పుడు చెయ్యకుండా నెమ్మదిగా వెళ్ళి వాటి తోకలుచ్చుకోటం....అవి తప్పించుకోటానికి గిజగిజ లాడుతుంటే ఆ చప్పుడు వింటం. ఒక్కోసారి వాటితోకలు తమచేతుల్లో నలిగిపోయి మెత్తగా తడి తడిగా అయిపోవటం అన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి సారథికి. అప్పుడు చిన్నతనంలో వాటిని అలా యిబ్బంది పెట్టటం... అదో సరదా....

ఇతర ప్రాణుల బాధని చూట్టం....చూసి ఆనందించటం హ్యూమన్ యినిస్టింక్ట్సులో ఒకటి. అందుకనే తక్కువవనని, ఎక్కువ తీరికా వున్న కొందరు వేటాడతారు.

గట్టిగా ఏవో అరుపులు గాలిలో తేలొచ్చి వినిపించాయి సారథికి. ఎవరో కుర్రాడు రాయి విసిరినట్టున్నాడు. కుంటుతూ గోలగా అరుస్తోంది పిచ్చిది. మిగిలిన కుర్రాళ్ళు నవ్వుతున్నారు. కూచుని కబుర్లు చెప్పుకుంటున్న పెద్దాళ్ళు ఓసారి చూసి తలతిప్పుకున్నారు.

ఇంక సారథి ఆగలేకపోయాడు....గబగబా డాబా మెట్లు దిగటమే అతనికి గుర్తుగా తెలిసింది. చెట్టు దగ్గరి కెళ్ళి పిల్లల్ని ఏవేవో కేకలేశాడు.

కొంతమంది పరిగెట్టుకు పోయారు. కొందరు చెట్టు చప్టామీద చేరి వేరే ఆటలు మొదలెట్టారు.

హడావిడి తగ్గాక ఆమెవేపు చూశాడు. పెద్దగా వయసుండదని పించింది సారథికి. వొంగుని ఎడంకాలు రాసుకుంటోంది. సారథి చూస్తుండగానే తనూ ఓసారి తలెత్తి చూసింది. కళ్ళల్లో నీళ్ళు కదుల్తున్నాయి. సాయంత్రపు ఆఖరి వెలుగులో ఆ నీళ్ళు కొద్దిగా మెరిసాయి. వొడ్డుమీద చేపనీళ్ళ తడికి దగ్గరగా చేరుతుంటే అలాగే చూస్తుందేమో....అనిపించింది సారథికి. ఆమె మళ్ళీ తలొంచుకుని కాలు రాసుకుంటుంటే నెమ్మదిగా అక్కణ్నించి వచ్చేశాడు.

* * *

గదిలో పెద్దగా చీకటి లేకపోయినా లైటేశాడు సారథి. అసలే ఏం చెయ్యటానికి తోచక చిరాగ్గా ఉంది డాబామీద కెళ్ళాడు. యిప్పుడు మరీ చిరాగ్గా ఉంది.

తెల్లారితే ఆదివారం. రోజంతా ఖాళీ. చెయ్యటానికి ఏపనీలేదు. ఏదో ఒకటి చెయ్యవచ్చు. కానీ ఏమీ చెయ్యాలనిపించదు. ఏవేవో చెయ్యాలని, క్షణం తీరికలేకుండా కృషిచేసి బతుకులో ఎంతో పైకి రావాలని ఉండేది యిదివరకు. కానీ యిప్పుడు రోజంతా ఖాళీ అయినా ఏం చెయ్యటానికి తోచదు. డిగ్రీ చేతికొచ్చాక ఏదో మంచి ఉద్యోగం వస్తుందని, యింకా ముందుకి చదవాలని....యిలా ఏవేవో కోరికలుండేవి. కాని యిప్పుడు ప్యూర్‌లీ టెంపరరీ గుమాస్తా ఉద్యోగం. దానితోపాటు బోలెడంత నిరాశా. భవిష్యత్తు గురించి ఆలోచించటానికి మనసు వొప్పుకోదు. ఏ చదువూ జీవితాన్ని బాగుచేస్తుందన్న నమ్మకంలేదు. ఉంటే ఉత్సాహంగా ఏదో ఒకటి చేసేవాడే....యిలా నూటయాభై రూపాయల లాటరీ ఉద్యోగంలో యింత నీరసించి పోయేవాడు కాదు.

ఏంతోచని చిరాకు....పెద్ద చనువుగా కాకపోయినా రోజూ తోడుగావుండే రూమ్‌మేట్ రమణ వూళ్ళోలేని చిరాకు....యిందాకటి పిచ్చిది కళ్ళముందు కదుల్తున్న చిరాకు....రూమంతా కలయతిరిగాడు సారథి. గంట గడిచేలోపల వోసారి బైటికెళ్ళి చూశాడు....తను అక్కడే ఉంది. చెట్టు చప్టామీద కూచునుంది. వీధిదీపం వెలుగు కొద్దిగా పడుతోంది.

మళ్ళీ లోపలికొచ్చాడు. రోడ్డునిచూస్తూ మంచంమీద కూచున్నాడు. తెల్లారేలోపలేనా రమణ ఊర్నుంచి వచ్చేస్తే బాగుణ్ణను కున్నాడు సారథి. రమణ వచ్చినా పెద్దగా తోచదు. కాని 'ఏం తోచ టంలేదు' అని చెప్పటానికైనా తోడు ఓ మనిషి ఉంటాడు. ఇంత ఒంటరితనం ఉండదు.

అలా అన్నప్పుడల్లా రమణ అనేమాట ఒకటే....''తొందరగా పెళ్ళిచేసుకో....'' అని....''ఏం చూసుకుని'' అనాలనిపిస్తుంది.

ఇంట్లో ఆడమనిషి....మరో మనిషితోడు బాగానే ఉంటుంది. కాని ఈ టెంపరరీ ఉద్యోగంతోనే తొందరపడితే....నిరుద్యోగపు తిప్పలు....డబ్బులేక అప్పులకోసం అందరిని దేవిరించటం....పస్తు లుండాల్సి వస్తుందేమో అన్న భయం, వాటి బాధ మరీ ఘోరంగా వుంటుంది.

ఉద్యోగం....పెళ్ళి....ఆడతోడు....ఆలోచన వాటివేపు మళ్ళి నప్పుడల్లా సరోజ, సీతా గుర్తొస్తారు సారథికి. వాళ్ళతోటిఉన్న ఒకటి రెండురోజుల సంబంధం గుర్తొస్తుంది. జీవితంలో తనకు దగ్గరగా తెలిసున్నవాళ్ళు వాళ్ళిద్దరే. వాళ్ళతోపాటు ఇరవైఆరేళ్ళ తనవయసు.. వయసు నరాల ఆలోచనలు యిబ్బందిగా వుంటాయి సారథికి. ఒక్కోసారి మరీ పిచ్చిగావుండి బజార్న పడదామా అనిపిస్తుంది. కాని అటువంటి అలవాటు లేకపోవడంవల్ల సహజంగావున్న భయం. ఆరోగ్యం చెడిపోతుందన్న బెదురు, ఇక దారితోచక తనని తనే బలవంతంగా అదుపులో పెట్టుకుంటుంటాడు.

కాస్సేపు మళ్ళీలేచి చిరాకుని పచార్లు చేయించాడు సారథి. కారియర్ రాగానే పెద్దగా ఆకలి లేకపోయినా, ఆపని అయిపోతుందిలే తన్నట్టు భోజనానికి కూచున్నాడు.

తింటూ....తింటూ గుమ్మంలో ఏదో అలికిడైన ట్టనిపిస్తే తలెత్తిచూశాడు. ముందుగా సీలంవోణీ కనిపించింది. గుమ్మంలో నిలబడివుంది పిచ్చిది. ఏం చెయ్యాలో తోచలేదు సారథికి. కంగారు పడ్డాడు. ''ఫో....ఫో....'' అందా మనుకున్నాడు. కాని నోట్లోముద్ద అడ్డుపడింది.

ఈలోగా నెమ్మదిగా గుమ్మంలో చితికిలపడింది. సారథి తింటున్న అన్నంవేపే చూస్తూ కూచుంది. రెండుమూడు నిముషాలైనా అలాగే చూస్తూ కూచుంది "పాపం ఆకలేమో....ఎప్పుడు తిందో...." అనుకున్నాడు సారథి. కొంచెం కంగారు తగ్గాక.

ఇంకో ఆకులో యింత అన్నంపెట్టి ఆమెముందు పెట్టాడు. ముందు గబగబా తింది, తరవాత కెలుకుతూ కూచుంటే, తన భోజనం పూర్తిచేశాడు సారథి.

నెమ్మదిగా కారియర్ సర్దిపెట్టి మంచంమీద కూచున్నాడు. తను తినటంకన్నా ఎక్కువగా అన్నం కెలుకుతోంది...."తిను.... తిను...." అన్నాడు ఒకటి రెండుసార్లు. తలెత్తిచూపి మళ్ళీ మరో రెండుముద్దలు తింది. తనే తింటుందిలే అని వూరుకున్నాడు.

సారథి చూస్తుండగానే ఎంగిలిచేత్తో అలాగే తలుపుకి చేర్లబడి నిద్దరపోయింది. ఏం చెయ్యటానికి తోచలేదు సారథికి. ఆకు తీసి బైటపారేశాడు. మంచంమీద కూచుని, నిద్దరపోతున్న తనవేపు చూస్తుంటే మళ్ళీ....చెట్టుకింద పిల్లలు ఏడిపించటం....తన కేకలు .. తను చూసిన చూపు....అన్నీ గుర్తొచ్చాయి....

"ఎన్నాళ్ళయిందో నిద్దరపోయి....పడుకోనీలే కాస్సేపు...." అనుకున్నాడు ఎంతో అమాయకంగా, కళ్ళు నిండుగా మూసుకుని. వొళ్ళు తెలియకుండా నిద్రపోతున్న తనని కాస్సేపు చూశాడు.

* * *

అర్ధరాత్రి ఏదో కల చెదిరి మెలుకువ వస్తే ఉలిక్కిపడి లేచాడు సారథి. లైటు వెలుగుతూనే ఉంది. ఆలోచిస్తూ పడుకున్నడగా తనకి నిద్ర పట్టెయ్యటం గుర్తువచ్చింది. దానితోపాటు గుమ్మంలో ఆ మనిషి గుర్తువచ్చింది. గబుక్కుని తల ఎత్తి చూశాడు. తలుపుకి చేర్లబడిలేదు. గోడవారగా పడుకునుంది. వోణీ పూర్తిగా చెదిరిపోయింది, లంగా సగంపైగా....లేచి గబుక్కుని లైటార్పేశాడు సారథి. వచ్చి మంచం మీద పడుకుని చాలాసేపు ప్రయత్నించాడు నిదరకోసం. నిద్ర రాలేదు. చెదిరిన కల....సరోజ, సీతా గుర్తు వస్తుంటే, సాయంత్రం ఆమె కనిపించిన రావిచెట్టు, పిల్లలు విసిరిన

రాళ్లు గుర్తుతెచ్చుకోవా లనుకున్నాడు. గొంతు తడారినట్టు, వొళ్ళు వొణుకున్నట్టు అనిపిస్తే మంచి నీళ్ళకోసం లేచాడు. వెయ్యకూడదను కుంటూనే లైటు వేశాడు. గోడవారగా అలాగే వొళ్ళెరక్కుండా పడుకునుంది తొలిగిన నీలంవోణీ.

మంచినీళ్ళుత్రాగి, లైటార్పి, వొళ్ళు వొణుకుతుంటే, గొంతు తడారిపోతుంటే, గోడవారగా, ఆ మనిషి దగ్గరగా వెళ్ళాడు సారథి ..

బాగా తెల్లారిపోయాక కాని మెలుకువ రాలేదు సారథికి. లేచిచూస్తే ఆ మనిషిలేదు. వెళ్ళిపోయుంటుందిలే అనుకున్నాడు. బద్దకంగావుంటే మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. రాత్రి ఆమెకి దగ్గరగా వున్నప్పుడు.... "ఆ వయస్సులో పాపం మతి సరిగ్గావుంటే. ఎవరి దగ్గరో...." అనుకున్నాడు సారథి.

తను చేసినపని మంచి చెడ్డలు దృష్టికిరాలేదు సారథికి. రోడ్డుమీద ఆలనా పాలనా లేకుండా తిరిగే ఆ పిచ్చిమనిషికి ఏ కడుపేనా వస్తే ఎవరు చూస్తారు....అన్న ఆలోచనా రాలేదు.

తెలివితేటలు, డిగ్రీలువుండి కష్టపడి పని చెయ్యగలవాళ్ళకే సరైన రక్షణ కల్పించలేని అశక్తతలోవున్న సమాజాన్ని సారథి కున్నంతమాత్రమేనా తటపటాయించు. సంస్కారంలేని బిచ్చగాళ్ళ తాగుబోతుల బారినుంచి ఆమెలాంటి వాళ్ళకి రక్షణ కల్పించమని అడగటం పిచ్చితనమే అవుతుందేమో.

("తరుణ"లో ముద్రితము)